క్లుప్తంగా

ఘనంగా పిచ్చుకల దినోత్సవం



ర్యాలీ చేపడుతున్న గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థులు

గోపాలపట్నం: అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం హైస్కూల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ జిల్లా ఎన్‌జీటీ కోఆర్డినేటర్ సూరెడ్డి బాబూరావు మాట్లాడుతూ పిచ్చుకలు క్రమేపి అంతరించిపోతున్నాయని.. వాటిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వాటి సంతతిని అభివృద్ధి చేయడానికి పిచ్చుక గూళ్లు, తిండి గింజలు నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. అంతక ముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుజాత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణపై చిత్రలేఖన పోటీలు


పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: వరల్డ్ ఫారెస్ట్ డేను పురస్కరించుకుని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశాల మేరకు సోమవారం ఆర్పీ పేట జీవీఎంసీ హైస్కూల్‌లో అటవీ సంరక్షణపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు 80 మంది విద్యార్థులు వివిధ రంగులతో అటవీ సంరక్షణ చిత్రాలు పెయింటింగ్ చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో హైస్కూల్ డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు నమ్మి జె.వి.సాయిశంకర్, సూరిశెట్టి రేణుకాదేవి, సీఆర్పీ లంక చైతన్య తదితరులు పాల్గొన్నారు.

హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ హై, లో ఓల్టేజ్ సమస్యతో పలు నివాసాల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా విద్యుత్ హై ఓల్టేజ్ వచ్చింది.వార్డు కార్పొరేటర్ ఇంట్లో టీవీ కాలి పోయింది. దీంతో ఆమె బంధువులు విద్యుత్ సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలి


ధర్నాలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణను అమలు చేయడానికి స్టీల్‌ప్లాంట్‌ను సిక్ ఇండస్ట్రీ చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఏడాదికి సరిపడా ముడి పదార్థాలు నిల్వ ఉంచాల్సి ఉండగా, వాటిని అందుబాటులో లేకుండా చేయడం ద్వారా ఉత్పత్తిని నిలిపివేయాలని కుట్ర చేస్తున్నారన్నారు. ప్లాంట్‌ను మూసేసి అదానీకి అమ్మాలని కేంద్రం చూస్తోందన్నారు. వెంటనే ముడి పదార్థాలు ఏర్పాటు చేయాలని, రుణాలను ఈక్విటీగా మార్చడంతో పాటు 10 ఏళ్లు ఇంట్రస్ట్ హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోరాటాలతో సాధించుకున్న ప్లాంట్‌ను అదే పోరాటాలతో కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్‌ల సేవలు


ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రం

మల్కాపురం: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు,శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. పట్టణప్రాంతంలో ప్రజల చెంతకే ప్రత్యేక వైద్యుల సేవలను అందుబాటులోకి తెచ్చారు.దీనిలో భాగంగా 58వ వార్డు పరిధి ములగాడ విలేజ్ వద్ద రూ. కోటితో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద ఆస్పత్రులు నిర్మించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇక్కడ పేద రోగులకు వైద్య సేవలను అందిస్తారు.

పరీక్షలు సైతం అందుబాటులో

ఈ ఆసుపత్రుల్లో ఎక్స్‌రే, రక్తపరీక్షల ల్యాబ్ ఉన్నాయి. మందులు పంపిణీ చేసే ఫార్మసిస్ట్, జనరల్ డాక్టర్,స్టాఫ్ నర్సులు,ఆయాలు,డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. రోగులకు సేవలు అందించడానికి అధునాతన వైద్య పరికరాలు,రోగులకు మంచినీటిని అందించేందుకు ఆర్‌వో ప్లాంట్ ఇక్కడ ఉన్నాయి. చుట్టూ పచ్చటి వాతావరణం నడుమ నిర్మించిన పది పడకుల ఆస్పత్రుల్లో లభిస్తున్న వైద్యసేవలకు పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రోజూ 30 నుంచి 45 వరకూ ఓపీ నమోదవుతోంది.

సేవలు ఇలా...

- ప్రతి సోమవారం జనరల్ సర్జన్ (సాధారణ శస్త్ర చికిత్స)
- ప్రతి మంగళవారం (శ్వాస కోశ వైద్య నిపుణులు)
- ప్రతి బుధవారం (ఎముకలు మరియు కండరాల వైద్య నిపుణులు)
- ప్రతి శుక్రవారం (చెవి,ముక్కు,గొంతు వైద్య నిపుణులు)
- ప్రతి శనివారం (చర్మ వ్యాధుల వైద్య నిపుణులు మరియు స్త్రీ వైద్య నిపుణులు) అందుబాటులో ఉంటారు.

నూకాలమ్మా.. చల్లగ చూడమ్మా!

- వైభవంగా ప్రతిమల ఊరేగింపు
- నేడు నూకాలమ్మ ప్రధాన పండగ


అమ్మవారి ప్రతిమలతో ఊరేగుతున్న భక్తులు


కాంతారా గెటప్‌లో ప్రత్యేక ఆకర్షణగా కళాకారులు

గోపాలపట్నం: గోపాలపట్నం నూకాలమ్మ ప్రధాన పండగను మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఘటాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా బాజి జంక్షన్‌లో అమ్మవారి ప్రతిమలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పులివేషాలు, కాంతారా సినిమాలో మాదిరి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు డ్యాన్సులు వేస్తూ యువకులను ఉర్రూతలూగించారు. మేళ తాళాలతో గోపాలపట్నంలో పలు వీధుల్లో ప్రతిమలను తలలపై పెట్టుకుని ఊరేగారు.

విశిష్ట ఏర్పాట్లు

మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా బారి కేడ్లు ఏర్పాటు చే శారు. వర్షం వల్ల ఇబ్బందులు లేకుండా టెంట్లు వేశారు.

జోరు వాన


గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం

గోపాలపట్నం: ఉదయమంతా ఎండకాయడంతో వర్షం బాధ పోయిందనుకున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇంటికి వెళ్లే సమయం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే 20 నిముషాల తర్వాత తెరపివ్వడంతో కొంత ఉపశమనం కలిగింది. చాలా మేరకు గెడ్డల్లో చెత్త పూడికలు తుడిచి పెట్టుకుపోయాయి. రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నిరసనలు.. విన్నపాలు


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కారం కోరుతూ సోమవారం పలు సంఘాల నాయకులు, ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసనలు, ధర్నాలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. చదువుకున్న మహిళలకు ఉపాధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ దళిత మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.మరియమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

జీవో నం–1 రద్దుకు డిమాండ్

జీవో నంబర్ 1ను తక్షణం రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, నాయకులు ఎస్.నారాయణ, ఆర్.పవన్, యు.నాగరాజు, దేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యం పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఆరు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

హమాలీల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయిస్ హమాలీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పీఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.

‘జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలి’


పుస్తకం బహూకరిస్తున్న విభాగాధిపతి జాలాది రవి

ఏయూ క్యాంపస్: జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని క్రీడా పరిశోధకుడు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ అన్నారు. సోమవారం ఏయూ ఎంబీఏ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ‘మాస్టర్ యువర్ లైఫ్’ అనే అంశంపై ఆయన మాట్లాడారు. యువత ప్రధానంగా తమ లోని అంతర్గత శక్తిని, సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నిత్య వ్యాయామం, పుస్తక పఠనం, తగినంత నిద్ర, మంచి ఆహారపు అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ ఆశావాద దృక్పథంతో యువత నడవాలన్నారు. తద్వారా ఉజ్వల భవితను సొంతం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం కిషోర్‌ను విభాగం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ శ్రీజ్యోతి సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలి


బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక: ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు కాపులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని తూర్పు కాపు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగరామ్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తూర్పు కాపులు ఉపాధి నిమిత్తం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నివాసాలను ఏర్పరుచుకుని జీవిస్తున్నారని, కానీ కేవలం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉంటున్న తూర్పు కాపులకే ఓబీసీ రిజర్వేషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లోని తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన తూర్పు కాపు సంఘం నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, మెరగాని ప్రసాద్, చెనమల గంగాధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలు కార్మిక సంక్షేమానికి గొడ్డలిపెట్టు


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి గొడ్డలి పెట్టువంటివని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులమంతా కలిసి ఈ విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలేదీక్షలు సోమవారానికి 767వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎక్స్ సర్వీస్‌మెన్ పాల్గొన్నారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైపోతుందని, అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు బహుమతుల ప్రదానం

పెదగంట్యాడ: కరాటే అనేది ఒక యుద్ధ కళ మాత్రమే కాదని, ఆత్మరక్షణకు కూడా ఉపయోగపడుతుందని కరాటే మాస్టర్ నారాయణమూర్తి అన్నారు. శాటికన్ స్పోర్ట్స్ కరాటే డో క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పెదగంట్యాడకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. వారికి సోమవారం దయాల్‌నగర్‌లో బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో పాటు చిలకలూరిపేటలోనూ ఆన్‌లైన్‌లో ఈ పోటీలను నిర్వహించారని తెలిపారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..


కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎం హెప్సిబా


హాజరైన విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పాఠశాలలో ఫేర్‌వెల్ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఉత్సాహంగా జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ హెప్సిబా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఇంటర్ కూడా పాఠశాలలో అందుబాటులో ఉందని.. అంతా ఇక్కడే చేరాలని కోరారు. ఇంతవరకు ఆడుతూ పాడుతూ సాగినా ఇంటర్ నుంచి కష్టపడి క్రమశిక్షణగా చదువుకోవాలన్నారు. స్కూల్ కమిటీ కోఆప్షన్ సభ్యుడు ఆళ్ల పైడి రాజు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్ పర్సన్ రాజామణి, ఆర్‌వీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు శోభన్‌బాబు


శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అభిమానులు

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులపేట మహాత్మాగాంధీ గ్రంథాలయం వద్ద సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సోమవారం ‘నటభూషణ్ ’ శోభన్‌బాబు 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘసేవకు మారుపేరుగా నిలిచిన మహోన్నత వ్యక్తి శోభన్‌బాబు అని కొనియాడారు. చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు వెంకటరమణ, కె.వెంకటరావు, గువ్వల.రమణ, జి.నాగరాజు, సూర్యనారాయణ, కె.రాజు, సత్యనారాయణ,అప్పారావు, కె. శోభనబాబు, పి.దేవకి, కె.సూర్యరత్నం, పాల్గొన్నారు.

చెల్లూరికి ఉత్తమ సేవా అవార్డు


చెల్లూరి భాస్కరరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు,సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావుకు మనం ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు ఇంటర్నేషనల్ గ్యాలరీ అవార్డు –2023 (ఉత్తమ సామాజిక సేవా) అందించారు. దీంతో ఆయన్ను సోమవారం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు చిత్రకారులు,సామాజిక సేవా కర్యకర్తలు అభినందించారు. సన్మాన గ్రహీత చెల్లూరి మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో నేటి పేద వాడి బతుకుపై గీసిన చిత్రానికి గుర్తింపు లభించందన్నారు. అలాగే పేద ప్రజలకు పలు అందిస్తున్న సేవలకు గాను మనం ఫౌండేషన్ ఉత్తమ సామాజిక సేవా కార్యకర్త అవార్డు అందించిందని చెప్పారు. మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు


శాంతి కపోతాలు ఎగురవేస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


పోటాపోటీగా తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

అగనంపూడి: పరవాడ మండల స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 85వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రసవత్తరంగా సాగాయి. సోమవారం ఉదయం ఎన్టీపీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హాలు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పరవాడ మండలంలోని 14 ఉన్నత పాఠశాలలకు చెందిన 480 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. బాలురు విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బాలికలకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ జీజీఎం సిన్హా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏటా ఈ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు చదువుతో ఆటలు తప్పనిసరన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రుమా డీ శర్మ, డీజీఎం అనితాకుమార్, మేనేజర్ ప్రకాశరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శేఖర్, కిరణ్, నాగు, మండల ఫిజికల్ డైరెక్టర్లు మోటూరు నాగేశ్వరరావు, పిళ్లా రవిశంకర్, బుడుమూరు అన్నాజీరావు, లోవరాజు పాల్గొన్నారు.

అమ్మో.. ఆ మార్గంలో ప్రయాణమా!

- ఐవోసీ మార్గంలో నిలిచిన ఆయిల్ లారీలు
- ఇబ్బంది పడ్డ పాదచారులు, ద్విచక్ర వాహనదారులు


ఐవోసీ మార్గంలో అడ్డంగా ఉన్న భారీ పరికరం

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌కు వచ్చే భారీ పరికరాల వల్ల ఆయిల్ లారీల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వారు లారీలను సర్వీసురోడ్డులో నిలుపుతున్నారు. దీంతో అటువైపు రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు,పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు రెండేళ్ల నుంచి చేపడుతున్నారు. అయితే విస్తరణ పనులకు అవసరమైన భారీ పరికరాలు ఇక్కడ ఐవోసీ మార్గం ద్వారా తరలిస్తుంటారు. అయితే ఆదివారం సాయంత్రం వచ్చిన భారీ పరికరం ఇక్కడ సర్వీసు రోడ్డులో వైపు నిలిపివేశారు. దీంతో ఆయిల్ లారీల రాకపోకలకు ఇబ్బందులు నెలకున్నాయి. ఇది ఇలా ఉంటే ఈ భారీ పరికరం ఓ వైపు పార్కు చేసి ఉంటే, మరో వైపు ఆయిల్ లారీలను నిలిపివేయండతో విశాలమైన ఆ మార్గం ఇరుగ్గా మారింది. దీంతో సోమవారం ఉదయం ఇటువైపు రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు భారీ పరికరం తరలించడంతో సమస్య పరిష్కారం అయింది.

ఏయూ ప్రగతిపై పూర్వ విద్యార్థుల హర్షం


వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల 1979–83 బ్యాచ్ విద్యార్థులు సోమవారం వర్సిటీని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఏయూను నూతన లక్ష్యాల దిశగా నడిపిస్తున్న విధానంపై హర్షం వ్యక్తం చేశారు. వర్తమాన తరం విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానం, విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా తీసుకుంటున్న చర్యలను వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన హాస్టల్ భవనం నిర్మాణాన్ని వారు పరిశీలించారు.